క్లుప్తంగా

ఉత్కంఠగా వైద్య విద్యార్థుల క్విజ్ పోటీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యార్థుల్లో క్లినికల్ పరిజ్ఞానం, ఆసక్తిని పెంపొందించేందుకు ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్(ఐఏపీ), జీజీహెచ్ పీడియాట్రిక్ విభాగం సంయుక్తంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించింది. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో నిర్వహించిన 38వ ఐఏపీ యూజీ క్విజ్ పోటీల్లో నాలుగు జట్లు ఉత్సాహంగా పాల్గొని తమ విజ్ఞానాన్ని, పోటీ భావనను ప్రదర్శించారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో జయంత్, రాజినీష్ చంద్ర విజేతలుగా నిలిచారు. వారు డివిజనల్ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. క్విజ్ పోటీల్లో విజేతలకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కఠినమైన శ్రమ, నిబద్ధత, అకడమిక్ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పరుచూరి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు



విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అష్టబంధన, మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో అష్టబంధన ద్రవ్యారాధన, మహాశాంతిహోమం, ఉష్ణబంధనం విశేష మహాశాంతిహోమం నిర్వహించారు. వైఖాన ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించిన హోమ కార్యక్రమంలో మురళీకృష్ణ అయ్యంగార్, వేదాంతం శశికి రణ్ పాల్గొన్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ గురువారం నాటితో కుంభాభిషేక మహోత్సవాలు ముగిస్తాయన్నారు. పూర్ణాహూతి, పద్మావతి సమేత శ్రీనివాసల దేవాలయ ప్రవేశం, 5 వేల మందికి అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉప్పలపాటి సేవలు ఆదర్శనీయం

వర్ధంతి కార్యక్రమంలో వక్తల నివాళి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కమ్యూనిస్టు నేత, మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రామచంద్రరాజు సేవలు ఎనలేనివని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఉప్పలపాటి ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. ఉప్పలపాటి రామచంద్రరాజు వర్ధంతి కార్యక్రమం వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా రామచంద్రరాజు నీతిగా, నిజాయతీగా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. విజయవాడ నగరంలో ముఠా కార్మికుల హక్కుల సాధనకు ఆయన చేసిన పోరాటం నేటికీ చిరస్మరణీయమన్నారు. నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నాయకులు కొట్టు రమణారావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, సంగుల పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్ విధానాలపై అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): సెల్ఫ్ డిఫెన్స్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు మహిళా పోలీస్‌స్టేషన్ అధికారులు, శక్తి బృందాలు అవగాహన కలిగిస్తున్నాయి. అందులో భాగంగా బుధవారం నగరంలోని పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్లను విద్యార్థులకు తెలియజేశారు. పటమట స్టేషన్ పరిధిలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్ చేయడం వలన నష్టాలు, సీసీ కెమెరాల వలన ఉపయోగారులు, నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. శక్తి యాప్ వలన ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ టి.దైవప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నమ్మించి వంచించిన చంద్రబాబు, పవన్

- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు
- 44వ డివిజన్‌లో చంద్రబాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, సత్య సాయిబాబు, నిరీష్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇవ్వడమే కాకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు సంతకం చేసిన బాండ్లను ఇచ్చి గద్దెనెక్కి ఏడాది దాటినా ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను నమ్మించి వంచించారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలో వైఎస్సార్ సీపీ 44వ డివిజన్ ఇన్‌చార్జి పెద్ది సత్య సాయిబాబు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వెలంపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని గుర్తుచేస్తూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వెలంపల్లి మాట్లాడుతూ ఇంటింటికీ క్యూఆర్ కోడ్‌తో వెళ్లి ప్రజలతో ఆ కోడ్‌ను స్కాన్ చేయించి కూటమి చేసిన మోసాలను వారికి వివరించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలకన్నా ఎక్కువ ఇస్తామని అప్పుడు ఆశ చూపించి ఇప్పుడు మొండి చెయ్యి చూపించారని మండిపడ్డారు. తొలుత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మద్యం తక్కువ ధరకు ఇస్తానన్న ఏకైక సీఎం చంద్రబాబు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం బార్లు, వైన్ షాపులతో కళకళలాడుతుందని వెలంపల్లి ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో మద్యం తక్కువ ధరకు అందిస్తానన్న ఏకైక సీఎం చంద్రబాబు అని విమర్శించారు. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు వివిధ రూపాల్లో ప్రజలను దోచుకుంటున్నాడని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి 15 ఏళ్లు సీఎంగా ఉండాలని ఆకాంక్షిస్తున్న పవన్ కల్యాణ్ తన పార్టీని టీడీపీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. పేదలు పేదలుగానే ఉండాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్నవాటిల్లోనే 5 లక్షల పింఛన్లు తొలగించిన ఘనుడు చంద్రబాబు అన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నాడంటే వారిని మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఎటువంటి ఆంక్షలు, కటింగ్‌లు లేకుండా ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని ఊదరగొట్టి చివరికి రూ.13 వేలు ఇవ్వటమే కాకుండా 30 లక్షల మంది తల్లులకు కోత విధించడం మోసం కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్యాన్ మరింత స్పీడ్‌తో తిరుగనుంది

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన చూసిన ప్రజలు ఎందుకు ఓటు వేసి గెలిపించామా అని బాధపడుతున్నారని వెలంపల్లి అన్నారు. గతంలో ఫ్యాన్ గుర్తుపై గెలిచినవారే ఈ రోజు సుపరిపాలన అంటూ ఇళ్లకు వస్తున్నారని, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఇచ్చిన బాండ్లను వారికి చూపించి తమకు బాకీ ఉన్న మొత్తాన్ని ఎప్పుడిస్తారని నిలదీయాలని చెప్పారు. త్వరలోనే ఫ్యాన్ మరింత స్పీడ్‌గా తిరగనుందన్నారు. తమ డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారామని చెప్పుకొంటున్న కొందరు కార్పొరేటర్లు, నాయకులు కేవలం అధికారం కోసం మాత్రమే వచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 44వ డివిజన్ ఇన్‌చార్జ్ పెద్ది సత్య సాయిబాబు, 37,38,39,44 డివిజన్ క్లస్టర్ అధ్యక్షుడు బొండా నిరీష్, డివిజన్ నాయకులు దాసి జయప్రకాష్ కెనడి, అంకాని నాగరాజు, షఫీఉల్లా, ఎస్‌కే జిలాని, గద్దా మాణిక్యాలరావు, వల్లం రవి, పెద్ది రాజారావు, దుర్గారెడ్డి, రమేష్, రాము, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల తయారీలో నాణ్యత పాటించాలి : ఈవో



ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి లడ్డూ ప్రసాదం స్వచ్ఛత, నాణ్యతకు అధిక ప్రాధాన్యమివ్వాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం లడ్డూ తయారీ పోటును ఈవో శీనానాయక్, అధికారులు బుధవారం తనిఖీ చేశారు. లడ్డూ తయారీలో పరిశుభ్రత పాటించడంతోపాటు నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని లడ్డూ దిట్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సూచించారు. ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. భక్తులకు శుచిగా, రుచిగా లడ్డూను అందించేందుకు దేవస్థానం నిర్దేశించిన దిట్టంనే వినియోగిస్తున్నట్లు ప్రసాదాల తయారీ కేంద్ర అధికారులు ఈవోకు వివరించారు. ఆధునిక యంత్రాలతో నూతనంగా లడ్డూ తయారీకి కొత్త భవనంలో అవసరమైన మిషనరీ ఏర్పాటు గురించి ఈవో అధికారులతో చర్చించారు. రానున్న దసరా ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదాల కొరత లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఓ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈవో వెంట ఏసీ రంగారావు, ఏఈవో శ్రీనివాస్, ఎన్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సత్యబాబు తదితరులు

వించిపేట(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్లు ఆపాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 50వ డివిజన్, క్వారీ ప్రాంతంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. 50వ డివిజన్ సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ ప్రజలకు భారంగా మారిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచనని హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు మోపి నిలువునా మోసం చేశారని విమర్శించారు. అవసరం లేకపోయినా బలవంతంగా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, దీనివలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉంటాయని చెప్పారు. ఒక పక్క రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడం లేదని చెప్పునే మరోపక్క బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ధ్వజమెత్తారు. వీటిపై ప్రజా సంఘాల పిలుపు మేరకు ఆగస్టు 5వ తేదీ వరకు సంతకాల సేకరణలతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, సచివాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పా. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజేశ్వరి, గురుమూర్తి. పెంటారావు. లక్ష్మీ, అమీరా, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నియంత్రణ అందరి బాధ్యత

వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి



మానవ అక్రమ రవాణాపై రైల్వే స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న ర్యాలీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా నియంత్రణ అందరి బాధ్యత అని వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ రైల్వేస్టేషన్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాతో బాలల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణంలో ఎవరైనా పిల్లలు ఒంటరిగా లేదా సమూహంగా గుర్తిస్తే వెంటనే 1098 లేదా, 1800–1027–222 లేదా, 0866–2470966 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. విజయవాడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ ప్రయాణంలో మీ పిల్లలతో పాటు చుట్టుపక్కల సమూహంలోని పిల్లలను కూడా గమనిస్తుండాలన్నారు. అనంతరం మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే ఆలీబేగ్, ఐసీడీఎస్ కౌన్సిలర్ జీవన్, వాసవ్య మహిళా మండలి సభ్యులు జె.హృదయరాజు, ప్రసాద్, సౌజన్య, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి : ఏసీపీ



విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులంతా ఉత్తమపౌరులుగా ఎదగాలని నార్త్ డివిజన్ ఏసీపీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ సూచించారు.గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో నాయకత్వం ప్రతివ్యక్తికి అవసరమైన ప్రాధానమైన నైపుణ్యమన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందేలా చూస్తే భవిష్యత్తులో వారు సమర్థవంతమైన నాయకులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పరిసరాలు, అవకాశాలు, ప్రేరణ ద్వారా అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యాసంస్థలు విద్యార్థుల్లో ఈ లక్షణాలను గుర్తించి, అభివృద్ధి చేసేందుకు తగిన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి.హారిక మాట్లాడుతూ వివిధ రకాల కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు తమ పాఠశాల కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో ఇటీవల నూతనంగా ఎంపిక జరిగిన స్కూల్ హౌస్ లీడర్లు, వివిధ యూనిట్ లీడర్లు, హౌస్ కెప్టెన్‌లకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటిస్తూ ఏసీపీ స్రవంతిరాయ్ వారికి బ్యాడ్జీలు అందించారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రెసిడెంట్ యు.వి.పుల్లారావు, సెక్రటరీ డి.సుజాత, ట్రెజరర్ జి.గంగాధర్, హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ఓంకార నరసింహం తదితరులు పాల్గొన్నారు.

17న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ (డీఎస్ఎంసీహెచ్) 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆగస్టు 17న జరుగుతుందని ఆహ్వాన కమిటీ తెలిపింది. ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఎక్కడ ఉన్నా పాల్గొనాలని పిలుపునిచ్చింది. రీయూనియన్ నిర్వహణకు ఇప్పటికే ఒకసారి సమావేశం నిర్వహించి బ్యాచ్‌కు చెందిన కొందరి నంబర్లు సేకరించామని, ప్రతి ఒక్కరు తప్పక పాల్గొనాలని కమిటీ సభ్యులు దాడి మహేష్, టీకేఎస్‌వీ ప్రసాద్ కోరారు. పూర్తి వివరాలకు సెల్: 81798 83388 నంబరులో సంప్రదించాలని కోరారు.

సంక్షేమ పథకాల కోత అన్యాయం : సీపీఎం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలను అందించకపోతుండటం అన్యాయమని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని, సమ్మె కాలపు వేతనాల అమలు కోరుతూ త్వరలో ఆందోళన చేపట్టనుండటంపై 38వ డివిజన్ మల్లికార్జునపేటలో బుధవారం శానిటేషన్ కార్మికుల గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ దేశవ్యాప్త పోటీల్లో ర్యాంకులు సాధిస్తున్న కీలకమైన కార్మికులకు సంక్షేమ పథకాలు కోతల కోసి అన్యాయం చేయడం సరికాదన్నారు. 30 నుంచి 40ఏళ్లుగా సేవలు అందించిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా గాలికి వదిలేయడమేనా? ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక సంక్షేమం అని ప్రశ్నించారు. ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేస్తూ కాంట్రాక్ట్ ఇచ్చే విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ నియోజకవర్గంలో ప్రవేశపెట్టిన కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా నెల్లూరు కార్మికులు అలుపెరుగని పోరాటం చేసి పిలిచిన టెండర్లను రద్దు చేయించడం కార్మికుల పోరాటానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్మికుల హక్కులను పనిగంటలను హరించి వేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పెంచిన కరెంటు చార్జీలు, అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా తలపెట్టిన ప్రజా పోరాటాల్లో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వి.సాములు ఎం.లక్ష్మి, చంద్ర, శశికళ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తోటివారికి సేవ, సహాయం చేయడం ద్వారా ఆనందకరమైన జీవితాన్ని పొందవచ్చునని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని కార్యాలయం దగ్గర డి.చిట్టెమ్మ కుటుంబం జీవనోపాధి నిమిత్తం రూ. 20 వేలు విలువ చేసే తోపుడు బండిని వైఎన్నార్ చారిటీస్ ద్వారా యలమంచిలి జయప్రకాష్ ఆమెకు ఉచితంగా అందజేశారు. మనకు ఉన్నదాంట్లోనే పేదలకు సహాయం చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. వైఎన్నార్ చారిటీస్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సీఐ వాసవి సూచించారు. పటమటలోని స్టెల్లా కళాశాలలో మానవ అక్రమ రవాణా నిరోధన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. నేటి కాలంలో మానవ అక్రమ రవాణా చేయడానికి సోషల్ మీడియాను వినియోగిస్తున్నరని, డ్రగ్స్‌ను క్యారీ చేయటానికి విద్యార్థినులను ప్రలోభ పెడుతున్నారని, వయసుతో పనిలేకుండా ఆడామగ తేడా లేకుండా అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారని చెప్పారు. విద్యార్థినులు ఎలాంటి ప్రలోభాలకు లోనూ కావొద్దని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని రూపొందించుకోవాలని సూచించారు.

సోషల్ మీడియా ద్వారా మోసాలు, నేరాలు..

మరో అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ ఎఫ్ఎంఎం సిస్టర్స్ ఆఫ్ మేరీ సిస్టర్ సహాయ మేరీ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో రకాల నేరాలున్నాయని, డ్రగ్స్ సరఫరా చేయటం కోసం అమాయకులను నేరగాళ్లు ఎంచుకుంటున్నారని, ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా ఈ విధమైన మోసాలు, నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ ఇన్నసియమ్మ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా అరికట్టడంలో అందరూ భాగస్వాములవ్వాలనే ఇతివృత్తం పోస్టర్ విడుదల చేసి ప్రతిజ్ఞ చేయించారు.

వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



రివర్ ఫ్రంట్ పార్కు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో వీఎంసీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఆయన వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి నగరంలోని వరద ముంపు ప్రాంతాలైన రామలింగేశ్వర నగర్ సాయిరాం కట్ పీసెస్ రోడ్డు, కృష్ణలంక రివర్ ఫ్రంట్ పార్క్ తదితర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆధ్వర్యంలో నగర పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లో కార్పొరేషన్ తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌ల గురించి కలెక్టర్‌కు వివరించారు. రామలింగేశ్వర నగర్, కృష్ణలంక ప్రాంతాల్లో పర్యటించి రిటైనింగ్ వాల్ వద్ద కృష్ణానది ప్రవాహం పెరిగినప్పుడు, రిటైనింగ్ వాల్ దాటకుండా నీటిని ఏ విధంగా మళ్లిస్తున్నారో వివరించారు.

నగరంలో 42 స్టాగ్నేషన్ పాయింట్స్

వరద ముంపు ప్రాంతాల్లో మాన్సూన్ రెస్పాన్స్ టీం మూడు షిఫ్టులలో పని చేస్తున్నారని చెప్పారు. వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు రిటైనింగ్ వాల్ వద్ద గల ఇంజినీరింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్లడ్జి మోటార్ పంపు సహాయంతో వరద నీరును ప్రజలు నివసిస్తున్న ప్రదేశాలకు రానివ్వకుండా డ్రెయిన్‌లో మళ్లిస్తున్న విధానాన్ని వివరించారు. కేవలం వరద ముంపు ప్రాంతాలే కాకుండా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 42 స్టాగ్నేషన్ పాయింట్స్(వర్షపు నీటి నిల్వలు ఉండే ప్రదేశాలు) గుర్తించి, ప్రతి పాయింట్ల వద్ద ఏమనిటీస్, ప్లానింగ్, శానిటరీ సెక్రటరీ 24 గంటలు మూడు షిఫ్టులలో పనిచేస్తున్నట్లు కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. నగర పరిధిలోని 42 స్టాగ్నేషన్ పాయింట్లలో 24 ఎయిర్ టెక్, 10 గల్పర్, 1 సూపర్ సక్కెర్, 69 ఆయిల్ ఇంజన్ మిషనరీస్‌తో వర్షపు నీటి నిలువలు రోడ్డుపైన ఉండకుండా, 21 జేసీబీలు, 9 లాంగ్ అర్మ్ పొక్లెయినర్స్‌తో కాలువలోని నీటి ప్రవాహానికి అంతరాయం కలిగించే వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ కె.చైతన్య, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోమ్యూటేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోండి

పటమట(విజయవాడతూర్పు): ఆస్తి పన్నుపై పేరు మార్పునకు ఆటోమ్యూటేషన్ సేవలను వినియోగించుకోవాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రమంతా ఈ సేవలు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ జరుగుతున్న సమయంలోనే ఆస్తి పన్నులోని పేరు మార్పు జరుగుతుందన్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తి యజమానిపై పన్ను పేరు మార్పుకు జాప్యం తొలగించేందుకు ప్రభుత్వం ఈజ్ ఆఫ్ గవర్నెన్స్‌లో భాగంగా మ్యూటేషన్ ప్రక్రియను సులభతరం చేసిందని చెప్పారు. ఇకపై ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు జరిగినప్పుడు పన్ను మార్పుకు కార్పొరేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలోనే పేరు మార్పు జరుగుతుందన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాలపై ఉన్న పాత బకాయిలు చెల్లించి, పన్ను పేరు మార్పుకు సంబంధించిన మ్యూటేషన్ చార్జీలు చెల్లించిన వెంటనే పన్ను పేరు మార్పు పత్రాన్ని ఎటువంటి జాప్యం లేకుండా మ్యూటేషన్ పత్రాలు పొందవచ్చని కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

చిట్టినగర్ సొరంగంలో లైట్ల సంఖ్య పెంచండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



వస్త్రలతను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): చిట్టినగర్ సొరంగంలో లైట్ల సంఖ్యను పెంచాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం వస్త్రలత, పంజా సెంటర్, గాంధీ హిల్ ఏరియా, చిట్టినగర్, కలరా హాస్పిటల్, సితార సెంటర్, విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు, రామరాజ్యనగర్, నాలుగు స్తంభాల సెంటర్, అంబేడ్కర్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిట్టినగర్ సొరంగంలో పెయింట్లను పూర్తి చేసి త్వరగా మరికొన్ని లైట్లు అమర్చాలని అధికారులను ఆదేశించారు. వన్‌టౌన్ లో‌బ్రిడ్జ్ పరిశీలించి మాట్లాడుతూ గతవారం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినా ఇంకా మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ శాఖ సమన్వయంతో మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా ఉండాలని, వస్త్రలత, సితార సెంటర్, చిట్టినగర్ కాంప్లెక్స్‌లోని వీఎంసీ కాంప్లెక్స్‌లో ఎలాంటి సమస్య లేకుండా వెంటనే ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఆయన ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీస్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వీధి వ్యాపారస్తులు వ్యాపారం చేయాలంటే కచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం టౌన్ వెండింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారస్తుల సర్వేకు ఆఖరి గడువు ఆగస్టు 5వ తేదీ అని, గడువులోగా సర్వేలో పాల్గొన్న వారికే ఐడీ కార్డులు జారీ చేయాలని, గుర్తింపు కార్డులు ఉంటేనే నగరంలో వీధి వ్యాపారం చేయటానికి అనుమతి ఇవ్వాలని కమిటీ తీర్మానించింది. నగరంలోని అన్ని రోడ్లను సర్వే చేసి వీధి విక్రయదారులు వ్యాపారం చేసుకునేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో వ్యాపారాలు నిర్వహించే చోట అంబులెన్స్, ఫైర్ వాహనాలు వెళ్లటకు నిర్ణీత స్థలాన్ని వదిలి మిగిలిన ప్రదేశాన్ని వీధి విక్రయదారులకు వ్యాపార నిమిత్తం కేటాయించాలని తీర్మానించారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి..

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న సచివాలయాల్లో ప్రతి రోడ్డును సర్వే చేసి వాటిలో గ్రీన్, రెడ్, ఎల్లో జోన్ల మార్కింగ్‌లను చేయాలని తీర్మానించారు. డ్రెయినేజీలపై ఆక్రమణలను తొలగించాలని. పారిశుద్ధ్య నిర్వహణకు అవాంతరాలు కలిగించే వీధి వ్యాపారులను తొలగించాలని, ఈట్ స్ట్రీట్‌లో వీధి విక్రయదారుల కొత్త జాబితా తీసుకొని వ్యాపారం చేసుకునేందుకు వీలైన స్థలాన్ని నిర్దేశించాలని కమిటీ తీర్మానం చేసింది. ప్రజా ప్రతినిధులు, వెండింగ్ అసోసియేషన్ మెంబర్లు, ప్లానింగ్ వెల్ఫేర్ శానిటేషన్ సెక్రటరీల సమన్వయంతో ప్రతి వీధిని సర్వే చేసి జోన్ల వారీగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వీఎంసీ కమిషనర్, టౌన్ వెండింగ్ కమిటీ చైర్మన్ ధ్యానచంద్ర అన్నారు. వీధివిక్రయదారులు తమ వ్యాపారం నిమిత్తం ప్లాస్టిక్ బ్యాగులను వినియోగించవద్దని సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, లేకుంటే జరిమాన విధించాలని ఆదేశించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు పర్యావరణహితమైన వస్తువులను వాడాలన్న అవగాహన సదస్సును నిర్వహించి, ప్రజల్లో చైతన్యం నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యుడు శర్వాణిమూర్తి, టౌన్ వెండింగ్ కమిటీ కన్వీనర్, ప్రాజెక్టు ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, వీధి వ్యాపారస్తులు షేక్ సబీర్, కంకిపాటి రత్నకుమారి, పిల్లి నాగమల్లేశ్వరి, ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.